# పెండ్లి పిలుపు

శ్రీమతి వే. వినత

రామారావు – ఇంటియజమాని.

రాణి, వాణి – కూతుళ్లు.

సరస్వతమ్మ – రామారావుగారి భార్య.

సుందరం – కొడుకు, వయస్సు 30, 32.

అప్పయ్యదీక్షితులు – పిల్లనిచ్చు పెద్దమనిషి

అవధాన్లు – పెండ్లిండ్ల పేరయ్య.

వెంకమ్మ – అప్పయ్యదీక్షితులుభార్య.

ఒక చిన్నయిల్లు. ఇంటిముందు కొద్దిగా కాంపౌండు. ఇల్లు చిన్నదైనా చూడటానికి డాబుగా వుంటుంది. సరస్వతమ్మ, కుమారుడికి అన్నంపెడుతూ-

"నాయనా! యెన్నాళ్లిట్లా వుంటావు" అన్నది.

సుందరం "ఏం. యెట్లా వున్నాను."

సరస్వతమ్మ "అదికాదురా-యెన్నాళ్లిట్లా పెళ్ళి చేసుకోకుండా వుంటావు. నీవు యేదో ఒక సంబంధముచూచి, ఊఁ అంటే ఆ మూడుముళ్లూ పడితే చూడాలనివున్నది. యేదో పెద్దవాళ్లమయిపోతున్నాము. నీ కడుపున రెండుకాయలుకాస్తే చూచి సంతోషించేవాళ్లము. మీ నాన్నగారుకూడా చాలా తొందరపడుతున్నారు నీ పెళ్ళిని గురించి."

యేమీమాట్లాడడు సుందరం.

"యేరా–యెన్ని చెప్పినా వూరుకుంటావు. నేను ఒక్కదాన్నీ ఇంట్లో వుండలేకుండావున్నా. త్వరగా కోడలువస్తే బాధ్యత అంతా వప్పచెప్పి, కాశీ, రామేశ్వరము యాత్రలకు వెళ్ళాలనుకుంటున్నా"

"ఇప్పుడు యెవరు వద్దన్నారు. తప్పకుండా వెళ్లు."

మజ్జిగపోస్తూ, "సరే, నీ యిష్టం ఇంకయేం చెప్పను" అంది సరస్వతమ్మ.

సుందరం ఎమ్. ఏ. ప్యాసయి కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తూన్నాడు. బుద్ధిమంతుడు, నల్లగా పొడుగ్గా వుంటాడు. ఇప్పటికి పది సంబంధాలకు తక్కువకాకుండా చూచాడు. కానీ ఒక్కపిల్లా తన మనోభావాలకు తగ్గట్టులేదు. యేదో ఒక లోపం కనపడుతునే వున్నది. పిల్ల బాగా చదువుకోవాలి; తనతోపాటు వుద్యోగంచేయాలి - సంగీతం రావాలి. పిల్ల యెఱ్ఱగా, సన్నగా పొడుగ్గా వుండాలి. దానిమ్మగింజలాంటి చక్కని పలువరస-ఇన్ని గుణాలు తను చూచిన యేఒక్క పిల్లలోను లేవు. ఇంకా చూస్తూనే వున్నాడు, తన కోరిక యెప్పటికైనా ఫలిస్తుందేమోనని.

ఒక రోజున రామారావు కోర్టునుంచివచ్చి బట్టలు విప్పి కోటుస్టాండుకు తగిలిస్తూ, "గుండెల్లో నొప్పిగా వుందబ్బా" అంటూ పక్కనున్న మంచంమీద వాలాడు. ఇదంతా చూస్తున్న సుందరం ప్రక్కవీధిలోనున్న డాక్టరు దగ్గరకు పరుగెత్తాడు. సరస్వతమ్మ భర్త గుండెలమీద కాపటంకాస్తూ కళ్ళనీళ్లు పెట్టుకుంది.

(ఇంతలో డాక్టరు, సుందరం ప్రవేశం)

డాక్టరు స్టెతస్కోపుపెట్టి పరీక్షచేస్తూ, "యెప్పటినుంచి మీకు యీ గుండెనొప్పి? ఇది వరకు యెప్పుడైనా వచ్చిందా" అని అడిగాడు.

రామారావు, "ఇది వరకు యెప్పుడూ లేదు. ఇదేదో క్రొత్తగా ప్రవేశించినజబ్బు - ఇంటికి వచ్చే దాకాకూడా యేమీలేదు. మామూలుగా వున్నాను" అన్నాడు రామారావు.

డాక్టరు "ఔను, ఔను. ఇందాకవస్తుంటే చూచాను. మీరేకదూ." (ప్రక్కనవున్న కొడుకువంక చూస్తూ) "యేంఫరవాలేదు ఈయనకు బాగా విశ్రాంతికావాలి. కొన్నాళ్ళపాటు యింటిదగ్గరవుంటే మంచి"దని ఒక ఇంజక్షన్ చేసి, తెల్లటిపొడి నీళ్ళలోకలిపి లోపలకు యిచ్చాడు. లేచివెళ్ళిపోతూ ఒక టానిక్కుకూడా వ్రాసి యిచ్చాడు డాక్టరు.

(మరుసటిరోజు)

అవధానులు "పడుకున్నారేమండీ రామారావు గారూ !"

"ఈ మధ్యన వంట్లో మరీ బాగుండటములేదు బాబూ ! డాక్టరు బాగా విశ్రాంతి తీసుకో మన్నాడు. యివాళో, రేపో అనేటట్లుగావుంది. నాపని. వాడికి ఆ మూడుముళ్ళూపడతాయా ఈ ఘటం వుండగా. అని ... "

"ఆ, యెంతమాట అట్లా యెప్పటికీ జరగదు లెండి. అన్నట్లు మొన్న చూచిన సంబంధము యేమైంది ? సుందరానికి నచ్చిందా పిల్ల."

"నచ్చితే నేను ఇట్లా యెందుకు మాట్లాడుతాను అవధాన్లూ ! నేను యెన్ని విధాలో చెప్పిచూచా. లాభంలేకపోయింది. కక్కువచ్చినా కల్యాణం వచ్చినా ఆగదన్నట్లు ఆ ఘడియవస్తే అదే అవు తుంది."

"చూచారూ - గోవిందనగర్‌లో ఒక మంచి సంబంధమువున్నది. పిల్ల బి. యస్. సి. ప్యాసయినది. సంగీతము నేర్చుకున్నది, చూడటానికిపిల్ల బాగుం టుంది. మన సుందరానికి తగిన సంబంధము. తప్ప కుండా చూడండి యిష్టపడతాడేమో !"

"చూడటానికేమి తప్పక చూస్తాడు ఆ మంచి రోజుకూడా మీరే చూచి చెప్పండి."

"రేపు నాల్గుగంటలకు మంచిది. నేనువస్తా- అంతాకలిసి వెళ్లవచ్చు."

సుబ్బారావుగారు ఒక పిల్ల జమీందారు. పూర్వము పెద్ద హోదాలోవున్నా యిప్పుడు అంతా పోయి సామాన్యంగావుంది. ఆయనకు ఒక్కతే కూతురు. ఆ కూతురికి పెద్ద యెత్తున పెండ్లిచేయా లనుకున్నాడు. పెండ్లివారు చూడటానికి వస్తున్నారు అంటే పెళ్ళి అంతా జరుగుతున్నట్లే భావించి, ఇద్దరు వంటవాళ్ళను పెట్టించి అయిదారు రకాల ఫలహారా లను చేయించి, 50 మందికిదాకా భోజన యేర్పాట్లు అవి చేయించి హడావిడిగా చేయించాడు.

(మరుసటిరోజు)

పెళ్ళికొడుకు తల్లి, తండ్రి కూతుళ్లు యిద్దరూ అవధాన్లు, పిల్లను చూడటానికి వెడతారు. గోవింద నగర్ వెళ్ళటానికి మధ్యన ఒక కాలువ దాటాలి. పెళ్ళివారు వస్తున్నారని తీసుకురావటానికి రెండు కార్లు. మధ్యన కాలువ దాటేందుకు ఒక యెద్దు బండి, నలుగురు నౌకర్లనుతీసుకుని, సుబ్బారావుగారు కాలువ దగ్గరకు వెళ్ళారు. అనుకున్నట్లుగా వారిని ఇంటికి తీసుకువచ్చారు.

నాల్గు గంటలకు అంతా కూర్చున్నారు.

పిల్లను గురించి అంతాచెప్పి, కూతురికి పెండ్లి కొడుకును పరిచయముచేసాడు.

ఆ పిల్ల నమస్కారముపెట్టి కూర్చున్నది.

సుందరం "యేమిగ్రూపు తీసుకున్నారు" అని అడిగాడు.

"బైయాలజీ తీసుకున్నాను."

"కాలేజీకి నడిచా బస్సుమీదా ?"

"బస్సుమీదే"

సరస్వతమ్మ (అమ్మాయి తల్లితో) "అమ్మాయికి పనిపాటలువచ్చా" అని అడిగింది.

"బాగానే చేయగలదు. మనమంతా నేర్చుకనే వచ్చామా వచ్చేటప్పుడు! ఎవరి యింటికి వాళ్లు వెళ్ళితే వాళ్ళకే చేతవుతుంది."

ఆ రాత్రికి పిల్లను చూడవచ్చినవారంతా అక్కడే భోంచేసి స్వగ్రామం చేరుకున్నారు. వాణీ, రాణీ లకు పెండ్లికూతురు నచ్చలేదు. పొట్టిగా వుందని, ఒకళ్లు యెత్తుగావుందని పేరేగాని, కందిన యెరుపు యేంబాగుందని హేళనచేశారు. సుందరానికి లోపల కాస్త నచ్చినా, పైకి బాగుండలేదని చెప్పేశాడు.

సరే పిల్ల తలిదండ్రులకు పిల్ల నచ్చలేదని ఉత్తరం రానేశారు.

ఒక రోజు, రామారావుగారు, సరస్వతమ్మ, కొడుకుతో "నాయనా! ఆఖరికి ఈ సంబంధము కూడా వద్దనేశావు. నీవేదో చూచి ఒప్పుకుంటావని గంపెడాశతో వున్నాము. అదికూడా వద్దనేశావు. ఆడపిల్ల లిద్దరికీ పెళ్ళిఅయిపోయింది. నీవుకూడా ఒక ఇంటివాడవు అవుతే చూడాలని ఆశగావుంది. నాకు గుండెపోటు యెక్కువగావున్నది. ఇక అట్టే రోజులు బ్రతకను. నీ పెళ్లిచూచి ఆనందించేప్రాప్తి నాకు లేనట్లున్నది. ఈ సారి పిల్లనుచూచి ఒప్పుకుంటే సెలవల్లో పెళ్ళిచేస్తాము" అని నీళ్లు నమిలాడు రామారావు

సుందరానికి రాత్రి నిద్రపట్టలేదు. తనవల్ల తల్లి, తండ్రి పడుతున్న వేదన ఇంతా, అంతా కాదు. నిజంగా తన పెళ్ళికి తండ్రి వుండడేమో అన్న కించకలిగింది. తను మొట్టమొదటే చూచింది వొప్పుకుంటే ఈ పాటికి ఒక పిల్లకాదు ... ... తనకి 20, యేళ్లప్పటినుండి చూచిన సంబంధాలు ఒక్కొక్కటే జ్ఞాపకానికి రాసాగాయి. తనకే నవ్వు వచ్చింది. ఈ సారి పిల్లనుచూచినా, చూడకపోయినా ఒప్పుకోవాలని గట్టి నిశ్చయానికి వచ్చాడు సుందరం. నిజంగా ఇంట్లో పిల్లలు కళ కళలాడుతూ తిరుగుతూవుంటే, అమ్మా, నాన్నచూచి యెంత సంతోషించేవాళ్లో. తెల్లవారంగానే అమ్మతో చెప్పెయ్యాలనుకున్నాడు సుందరం. ఈ సారి చూచిన పిల్లను తప్పకుండా చేసుకుంటానని.

కొద్ది రోజులు పోయాక అవధాన్లు యింకో సంబంధము చెప్పాడు. సుందరం ఈ సారి పిల్లను చూడనని, మీరే చూచి మంచి ముహూర్తము నిశ్చయిస్తే పెళ్లిచేసుకుంటానని చెప్పాడు. రామారావుగారు కొడుకులో కలిగిన మార్పుకు ఆశ్చర్యపోయారు.

(గుళ్లపూడి అనే గ్రామంలో అప్పయ్య దీక్షితులు అనే పూర్వాచార పరాయణుడువున్నాడు. ఆయన కూతురికి పెద్దమనిషి కాకుండానే పెళ్ళిచెయ్యాలన్న పట్టుదలతోవున్నాడు.)

అవధాన్లు, అప్పయ్యాగారితో "పిల్లాడు చాలా బుద్ధిమంతుడు, మంచి సాంప్రదాయంగల కుటుంబము. మనము వదిలిపెట్టాలిసిన సంబంధముకాదు" అన్నాడు.

అప్పయ్యదీక్షితులు "మరి కట్నం మాటో" అన్నాడు.

అవధాన్లు "కట్నంయేమీ అక్కరలేదు."

"పిల్లవాడి వయస్సెంత ?"

"ఆ, అట్టే పెద్ద వయస్సు కాదులెండి; 30, లోపే."

"సరే, పిల్లవాడిని చూడవలసినపని లేదులెండి. యేదో ఒక శుభముహూర్తముచూడు; శుభకార్యము కానిద్దాము."

పెళ్ళి రేపనగా, పెళ్ళివారంతావచ్చారు. అయిదు రోజులు పెళ్ళి. చాలా బ్రహ్మాండంగా జరుగుతున్నాయి యేర్పాట్లు. వూరంతా మేళ తాళాలతో మారుమ్రోగుతోంది. తెల్లవారితే స్నాతకము. ఆడపెళ్ళివారిలో కలకలం బయలుదేరింది. అందులో ఒకావిడ.

"యేమమ్మా, వెంకమ్మా! నీ కూతురికి యింత కన్నా మంచి సంబంధము దొరకదనా. అంత ముసలివాడిని అల్లుడుగా చేసుకుంటున్నావు" అంది.

"అల్లుడు చిన్నవాడేనమ్మా మహావుంటే 20, యేళ్లు - యింతేగా" అన్నది వెంకమ్మ.

ఇంకో ఆవిడ "యేమిటమ్మోయి! అల్లుడ్ని అప్పుడే వెనకేసుకొస్తున్నావు. కాకిముక్కుకు దొండపండుకట్టినట్టు బలే సంబంధము దొరికింది!"

వెంకమ్మ మారుమాట్లాడలేకపోయింది. వెంకమ్మకీ బంధువులకు అనుమానంవచ్చి విడిదికి వెళ్ళిచూచారు. స్నాతకం పీటలమీద కూచున్న సుందరాన్నిచూచి నివ్వెరపోయారు ఆడపెళ్ళివారంతా.

వెంకమ్మ చరచరా ఇంటికివచ్చి భర్తతో, "అంతా మోసం ఈ పెళ్లి నేను సుతరాము ఒప్పుకోను" అన్నది.

అప్పయ్య దీక్షితులు అయిపోయిందిగా - కాస్త నా పరువు దక్కించి ఒప్పుకో" అన్నాడు.

వెంకమ్మ "ఈ పెళ్ళికనక జరిగేటట్లయితే, తక్షణం భావిలోపడి చస్తా"నన్నది. వచ్చిన చుట్టాలంతా అప్పయ్య దీక్షితులిని దుయ్యబట్టుకున్నారు. 'అసలు ఇటువంటి సంబంధము అని తెలిస్తే ఇంతదూరం రానిచ్చేవాళ్ళంకాదు. ఇది తప్పితే ఇంకోటి దొరకదనా యిది ఒప్పుకోటం. యెంత మాత్రము ఒప్పుకోటానికి వీలులేదన్నాడు' పిల్లమేనమామ. యెక్కడి మేళాలక్కడ ఆగిపోయినాయి. ఈ సంగతి మొగపెళ్ళివారిదాకా వెళ్ళిపోయింది. ఇంత హడావిడి చేసి చివరికి పెళ్ళినాటికి, పిల్లకు యిష్టంలేదని చెప్పినందుకు చాలా ఆశ్చర్యపోయారు మొగపెళ్ళివారు. "ఇంతకూ అసలు సంబంధము చెప్పిన అవధాన్లు యేడీ" అన్నాడు ఒక పెద్దమనిషి - అవధాన్లు యిక కంటికి కనుపిస్తాడా! యెప్పుడో పారిపోయాడు.

మగపెళ్ళివారు తిరిగి ఇంటికిచేరారు. సుందరంలో కలిగిన మార్పుకు, ఈసారన్నా పెళ్ళి అవుతుందనుకుంటే, అదీ తప్పిపోయింది పాపం.

మెదడును చల్లబరచి,
శిరోజములను నల్లబరచి,
కుదుళ్లను పదిలము చేయునది

కేసరిగారి

భృంగామలకతైలము

వెల రు. 2-0-0

వాడిచూడండి.

కేసరి కుటీరం లిమిటెడ్
రాయపేట, మద్రాసు 14.